రాజీయే రాజ మార్గం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సెప్టెంబర్ తొమ్మిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకుంటే వారి సమయం, ధనం వృథా కాకుండా ఉంటాయని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చూస్తున్నామన్నారు. రాజీయే రాజ మార్గమని, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ తగాదాలు, వాహన ప్రమాద తదితర కేసులు ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. మీడియా సంస్థలు ఈ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పంచాయతీ ఉపపోరు ప్రశాంతం..!

వైసిపి అభ్యర్థులకు కలిసొచ్చిన సానుభూతి

ఉమ్మడి జిల్లాలో 4 సర్పంచి స్థానాలకు పోలింగ్

3 వైసిపి, ఒకటి టిడిపి బలబరిచిన అభ్యర్థుల విజయం

31 వార్డుల్లో 17 వైసిపి , 13 టిడిపి, ఒకటి జనసేన సానుభూతిపరుల గెలుపు

ఏలూరు జిల్లాలో 81.71 శాతం, పశ్చిమలో 79.20 శాతం ఓటింగ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ పంచాయతీ ఉపఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పంచాయతీ సర్పంచి ఎన్నికల పోరులో వైసిపికి సానుభూతి కలిసొచ్చింది. సర్పంచిగా పనిచేస్తూ మృతిచెందిన వ్యక్తి కుటుంబ సభ్యులే పలుచోట్ల బరిలోకి దిగారు. దీంతో రెండు జిల్లాలో నాలుగు సర్పంచి స్థానాలకు ఎన్నికలు జరగ్గా మూడుస్థానాల్లో వైసిపి అభ్యర్థులే గెలిచారు. ఒక స్థానంలో టిడిపి బలపరిచిన అభ్యర్థి విజయంసాధించారు. రెండు జిల్లాల్లో 31 వార్డులకు జరిగిన ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థులు అత్యధిక వార్డులను గెలుపొందారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన రెండు జిల్లాలోని పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు సంబంధించి ఈనెల ఆరోతేదీన ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. ఏలూరు జిల్లాలో నాలుగు సర్పంచులు, 47 వార్డులకు, పశ్చిమలో మూడు సర్పంచులు, 27 వార్డులకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల ఎనిమిదో తేదీన నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యేసరికి పశ్చిమలోని మూడు సర్పంచి స్థానాలకుగాను యలమంచిలి మండలం దొడ్డిపట్ల, పాలకొల్లు మండలం అగర్తిపాలెం సర్పంచి పదవులు, వివిధ గ్రామాల్లోని 17 వార్డులకు సంబంధించిన పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఏలూరు జిల్లాలో నాలుగు సర్పంచి, 47 వార్డు పదవులకు నోటిఫికేషన్ వెలువడగా ఒక సర్పంచి, 26 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన స్థానాలకు శనివారం ఎన్నికల జరిగాయి.



వేము రాజు (అడవినెక్కలం సర్పంచి)

సుగుణబాబు (వణుదుర్రు సర్పంచి)

లక్ష్మణేశ్వరరావు (వీరమ్మకుంట సర్పంచి)

అప్పనస్వామి (కావలిపురం సర్పంచి)

సర్పంచి పోరులో వైసిపిదే పైచేయి

పంచాయతీ సర్పంచి ఎన్నికల ఉపపోరులో వైసిపి పైచేయి సాధించింది. సర్పంచి పదవిలో ఉండగా మృతిచెందిన నాయకుని కుటుంబంలోని వారే ఎన్నికల బరిలో దిగారు. దీంతో సానుభూతి కలిసివచ్చిందన్న చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో మూడు పంచాయతీల్లో సర్పంచి ఎన్నికలు జరిగాయి. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామ సర్పంచిగా పనిచేసిన చిన్నం అర్జున్‌రావు మృతిచెందడంతో అక్కడ ఉపఎన్నిక జరిగింది. ఆయన సోదరుడు చిన్నం సుగుణబాబును వైసిపి సర్పంచి అభ్యర్థిగా బరిలో దించింది. సానుభూతి పనిచేయడంతో సుగుణబాబు 444 ఓట్ల మెజార్టీతో విజయంసాధించారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం పంచాయతీ సర్పంచిగా పనిచేసిన వేము అబ్రహం మృతిచెందడంతో ఉపఎన్నిక జరిగింది. ఎన్నికల్లో కుమారుడు వేము రాజును వైసిపి బరిలోకి దించింది. సానుభూతి కలిసిరావడంతో వేము రాజు 323 ఓట్లతో సర్పంచిగా గెలిచారు. నువ్వానేనా అన్నట్లు సాగిన పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మరడాని లక్ష్మణసోమేశ్వరరావు 286 ఓట్లతో గెలుపొందారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం కావలిపురం పంచాయతీకి సంబంధించి సర్పంచి వనచర్ల వెంకటేశ్వరరావు మృతిచెందడంతో ఉపఎన్నిక జరిగింది. ఇక్కడ వెంకటేశ్వరరావు భార్య వైసిపి నుంచి, తమ్ముడు వనచర్ల అప్పనస్వామి టిడిపి నుంచి పోటీపడ్డారు. వదిన, మరిది నడుమ హోరాహోరీగా సాగిన పోరులో టిడిపి బలపరిచిన వనచర్ల అప్పనస్వామి 164 ఓట్లతో గెలుపొందారు. ఏలూరు జిల్లాలో 21, పశ్చిమలో పది వార్డు సభ్యులకు ఎన్నికలు జరగ్గా అత్యధిక స్థానాలను వైసిపినే దక్కించుకుంది.

పంచాయతీ వార్డు స్థానాల్లోనూ వైసిపిదే పైచేయి

పశ్చిమలో పదివార్డులు, ఏలూరు జిల్లాలో 21 వార్డులకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పశ్చిమలో ఏడు వార్డుల్లో వైసిపి, మూడుచోట్ల టిడిపి బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. ఏలూరు జిల్లాలో 21వార్డుల్లో ఎన్నికలు జరగ్గా పది చోట్ల వైసిపి, పదిస్థానాల్లో టిడిపి, ఒకస్థానంలో జనసేన సానుభూతిపరులు కైవసం చేసుకున్నారు. రెండు జిల్లాల్లో 31 వార్డుల్లో వైసిపి 17 చోట్ల, టిడిపి 13 స్థానాల్లో, జనసేన ఒకస్థానంలో ఆయా పార్టీల సానుభూతిపరులు గెలుపొందారు.

వీరమ్మకుంటలో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ

పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ ఎన్నికల్లో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య కొంత సేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఎన్నికల జరిగే గ్రామంలోకి రానీయకుండా టిడిపి నేత, మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి వెళ్లడంతో ఇరుగ్రూపుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

పోలైన ఓటింగ్‌శాతం

ఏలూరు జిల్లాలో మొత్తం 10,941 మంది ఓటర్లు ఉండగా శనివారం జరిగిన ఎన్నికల్లో పురుషులు 4392 మంది, మహిళలు 4578 మంది మొత్తం 8,940 మంది మొత్తం 81.71 శాతం మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పశ్చిమలో మొత్తం 5,566 మంది ఓటర్లు ఉండగా 4,408 మంది ఓటు వేశారు. ఇందులో 2,100 పురుష ఓటర్లు, 2,308 మంది మహిళా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

భీమవరం:జిల్లాలో శనివారం జరిగిన పంచాయతీ ఉపఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లాలో ఒక సర్పంచ్, పది వార్డు సభ్యుల పదవులకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో 79.20 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో ఇరగవరం మండలం కావలిపురం, పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామ పంచాయతీల సర్పంచి పదవులకు, 28 వార్డు పదవులకు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల సర్పంచి పదవులు ఏకగ్రీవమయ్యాయి. వార్డు సభ్యుల పదవుల్లో వీరవాసరం మండలం మెంటేపూడి, ఉండి మండలం కలిసిపూడి, ఆకివీడు మండలం కుప్పనపూడి 2, 7 వార్డులు, అజ్జమూరు, ఇరగవరం మండలం కావలిపురం, పెనుమంట్ర మండలం వెలగలేరు, తణుకు మండలం ముద్దాపురం, తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్యపాలెం, వీరంపాలెం, పోడూరు మండలం కొమ్ము చిక్కాల, పాలకొల్లు మండలం వెలివెల, దిగమర్రు, దగ్గులూరు, పెంటపాడు మండలం చింతపల్లి, నరసాపురం మండలం కే.బేతపూడి, తూర్పు తాళ్ల, యలమంచిలి మండలం కాంబోట్లపాలెం వార్డు పదవులు ఏకగ్రీవమయ్యాయి.

ప్రశాంతంగా పోలింగ్

ఒక సర్పంచి, పది వార్డు సభ్యుల పదవులకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ తెలిపారు. ఇరగవరం మండలం కావలిపురం సర్పంచి పదవికి, అలాగే వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, ఇరగవరం మండలం గోటేరు, పెనుమంట్ర మండలం మార్టేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం గోరింటాడ, చింతపర్రు, పెంటపాడు మండలం కాసపపెంటపాడు, గణపవరం మండలం గణపవరం మొత్తం 10 వార్డు సభ్యుల పదవులకు పోలింగ్ జరిగినట్లు తెలిపారు.

79.20 శాతం పోలింగ్ నమోదు

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు మండలంలోని గోరింటాడ, చింతపర్రు గ్రామాల్లో చెరో వార్డుకు సంబంధించి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చింతపర్రు ఆరోవార్డులో మొత్తం 246 ఓట్లకుగాను 202 ఓట్లు పోలయ్యాయి. గోరింటాడలో ఆరో వార్డుకు మొత్తం 98 ఓట్లకు 74 ఓట్లు పోలయ్యాయి.

చింతపర్రులో వైసిపి బలపరిచిన అభ్యర్థి అంగర రామ లక్ష్మి, తనప్రత్యర్థి టిడిపి బలపరిచిన గూడవల్లి వెంకటరమణపై 10 ఓట్ల మెజార్టీతో విజయంసాధించారు. గోరింటాడలో ఇద్దరూ వైసిపి బలపరిచిన అభ్యర్థులే పోటీపడ్డారు. పీతల యమునా దుర్గ చంద్రకళ 44 ఓట్లు సాధించగా, చవ్వాకుల మేరీ ప్రియాంక 29 ఓట్లు మాత్రమే సాధించింది. యమునాదుర్గ చంద్రకళ 15 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

పెనుమంట్ర : మార్టేరు 14వ వార్డు ఉప ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థి కప్పల అనంతలక్ష్మి విజయంసాధించారు. 138 ఓట్ల మెజార్టీతో గెలుపొందిందని ఎన్నికల అధికారి, ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు.

వీరవాసరం : మత్స్యపురి పంచాయతీ వార్డు సభ్యుని ఉపఎన్నికల్లో వైసిపి బలపర్చిన కారిపెల్లి విజయలక్ష్మీ తన సమీప అభ్యర్థి జనసేన, టిడిపిలు బలపర్చిన కారిపెల్లి కమలకుమారిపై 160 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. మత్స్యపురిలో విజయలక్ష్మీ విజయానికి భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు ముందుండి నడిపించి తన ఆదిపత్యాన్ని నిలబెట్టుకోగా ఈయనకు షన్ముఖరావు తన సహాయసహాకాలు అందించడంతో విజయం వైసిపి పరమైంది. ఈ పోలింగ్‌లో మొత్తం 292 ఓట్లకు గాను 234 మంది ఓటు వేశారు. విజయలక్ష్మీకి 197 ఓట్లు రాగా కమలకు మారికి 37 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

తణుకు రూరల్ : తణుకు మండలంలోని తేతలి గ్రామంలో ఎనిమిదో వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి కోట దుర్గారావు తొమ్మిది ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇరగవరం మండలంలోని కావలిపురంలో జరిగిన సర్పంచి ఉప ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి వనచర్ల అప్పన్నస్వామి 164 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. ఇరగవరం మండలంలోని గోటేరు గ్రామంలో ఐదో వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి మెంటే రాధ 17 ఓట్లతో గెలుపొందారు.

నెలాఖరుకు జగనన్న ఇళ్లు పూర్తికావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెలాఖరు నాటికి జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం తణుకు మండలం దువ్వ గ్రామంలోని జగనన్న లేఅవుట్ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన సందర్భంగా ఈ నెలాఖరు నాటికి సిఎం జగన్ కాకినాడ జిల్లా సామర్లకోటలో జగనన్న కాలనీని ప్రారంభించనున్నారన్నారు.

అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 25 జిల్లాల్లో ఒక్కొక్క లేఅవుట్‌ను ప్రారంభిస్తారన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో తణుకు మండలం దువ్వ లేఅవుట్‌ను సిద్ధం చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటరమణ, డిఇ కెకెడి.ప్రసాద్, ఎఇ వెంకటరెడ్డి, తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు, సర్పంచి అడ్డాబాబు, ఎంపిపి రుద్ర ధనరాజు పాల్గొన్నారు.

ఆకివీడులో కిరాతకం..!

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి - ఆకివీడు

నిండు నూరేళ్లు నీతో జీవితం పంచుకుంటా, నువ్వే నా ప్రాణం అంటూ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ దంపతులకు ఒక కుమారుడు జన్మించాడు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో భర్తకు చెడు అలవాట్లు, దొంగతనాలు వ్యసనంగా మారాయి. భార్య హెచ్చరించినా మారలేదు. దీంతో వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. తమ వివాహాన్ని రద్దు చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆలయానికి వెళ్లిన భార్యను కత్తితో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశాడు భర్త. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. ఈ ఘటన ఆకివీడులో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆకివీడుకు చెందిన వాడపల్లి రాంబాబు, సంధ్యారాణి (24) మూడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వారికి కుమారుడు ఉన్నాడు. రాంబాబు మొదట్లో బాగానే ఉన్నా క్రమంగా వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ దశలో భార్య సంధ్యారాణి రెండుసార్లు అతన్ని హెచ్చరించింది. చెడు అలవాట్లు, దొంగతనాలతో అబాసుపాలు అవుతున్నామని, మానకపోతే నీకు దూరంగా వెళ్లిపోతానని హెచ్చరించింది. అయినా ఫలితం లేకపోవడంతో అతడిని వదులుకోవడానికి నిర్ణయించుకుంది. సుమారు రెండు నెలల క్రితం పెద్దల సమక్షంలో తమ వివాహాన్ని రద్దు చేసుకుందామని, కోర్టులో కలుసుకుందామని ఇద్దరు నిర్ణయం తీసుకున్నారు. దొంగతనాల కేసులో ఈ మధ్య కాలంలో జైలుకు వెళ్లిన రాంబాబు ఇటీవల బెయిల్ మీద బయటకు వచ్చాడు. పుట్టింటికి వెళ్లిన సంధ్యారాణి ప్రతిరోజు తన తండ్రితో కలిసి ఆలయానికి వెళ్తూ ఉండేది. శనివారం ఉదయం కూడా స్థానిక భీమేస్వారస్వామి ఆలయానికి బయలుదేరింది. ఆలయం దగ్గరకు వెళ్లేసరికి తన భర్త రాంబాబు వెనుకగా వచ్చి కత్తితో ఆమె పీక కోశాడు. దీంతో సంధ్యారాణి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. రాంబాబు కత్తితో మరిన్ని పోట్లు పొడిచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తనకు నిత్యం తోడు వచ్చే తండ్రి ఆ రోజు కొంత ఆలస్యంగా వచ్చాడు. రక్తపు మడుగులో పడి ఉన్న తన కుమార్తెను ఒక్కసారిగా అతను కుప్ప కూలిపోయాడు. ఆలయానికి వచ్చిన వారి ద్వారా సమాచారం తెలుసుకున్న 108 వాహనం సంఘటనా స్థలానికి చేరుకుంది. అప్పటికే సంధ్యారాణి మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. మృతుడు అప్పటికే పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌పై ఎక్కించారు.

రక్తపు మడుగులో సంధ్యారాణి మృతదేహం

మృతదేహంతో రాస్తారోకో

సిపిఎం మద్దతు

అంబులెన్స్ అన్ని వీధులు దాటి జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి మృతురాలి బంధువులు, సిపిఎం నాయకులు అంబులెన్స్ నిలిపివేశారు. మృతదేహాన్ని అంబులెన్స్ నుంచి కిందకి దింపి జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ హత్య ప్రణాళిక ప్రకారం జరిగిందని, హత్య చేసిన వారి వెనుక ఉన్న అందరిని గుర్తించాలని, కేసు పటిష్టంగా ఫైల్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ మేరకు పూర్తిస్థాయి విచారణ వేగవంతంగా జరుగుతుందని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు వచ్చి హామీ ఇస్తే తప్ప తాము రాస్తారోకో విరమించేది లేదని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు అప్పగించేది లేదని చెప్పారు. మృతురాలి కుమారుడి భవిష్యత్తుకు ప్రభుత్వం కచ్చితమైన ఆర్థిక భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్, ఆర్‌డిఒ, డిఎస్‌పి స్థాయి ఉద్యోగుల హామీని మాత్రమే తాము అంగీకరిస్తామని ప్రకటించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాస్తారోకో చేశారు. ఎట్టకేలకు మధ్యాహ్నం ఒకటిన్నర దాటాక డిఎస్‌పి శ్రీకాంత్ వచ్చి ఆందోళనకారులతో సుమారు అరగంట సేపు చర్చించారు. వారి డిమాండ్లన్ని ఆమోదిస్తామని తెలిపారు. విచారణలో లోపం లేకుండా పూర్తి స్థాయిలో జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆర్‌డిఒ దాసిరాజు అక్కడికి వచ్చారు. ఇద్దరు డివిజనల్ స్థాయి అధికారులు మృతురాలి తల్లిదండ్రులతో, సిపిఎం నాయకులతో మరొకసారి చర్చించారు. డివిజనల్ అధికారులు ఇచ్చిన హామీ మేరకు రాస్తారోకోను విరమించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం సంఘటన స్థలాన్ని డిఎస్‌పి శ్రీకాంత్ పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్త్రీ శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి సుజాత రాణి పోలీస్‌స్టేషన్‌కి వచ్చారు. ఆమెతో కలిసి ఆర్‌డిఒ, డిఎస్‌పిలు చర్చించారు. మృతురాలి కుమారుడికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా సహకరించే అవకాశం ప్రయత్నించవచ్చని నిర్ణయించారు. బాలుడి సంరక్షణకు ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు కృషి చేస్తామని వారు ప్రకటించారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు కేసు : డిఎస్‌పి శ్రీకాంత్

మృతురాలి బంధువులు, సిపిఎం నేతలు కోరినట్లుగా కేసు ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తామని డిఎస్‌పి శ్రీకాంత్ తెలిపారు. విచారణ అత్యంత వేగవంతంగా జరిపి 15 రోజుల్లోగా ఛార్జ్‌షీట్ వేసే విధంగా ఆదేశిస్తున్నానని తెలిపారు. ఆందోళనలో సిపిఎం నాయకులు కె.తవిటినాయుడు, డోకల రవితేజ, బొక్కా వర్మ, గేదెల ధనుష్, సందక ఉదయ కుమారి, ఐద్వా, సిపిఎం నాయకులు, టిడిపి నాయకులు మాజీ సర్పంచి గుంట్ల గణపతి, గంధం ఉమా సత్యనారాయణ, బచ్చు కృష్ణ పాల్గొన్నారు.

నిందితుడిని క్షించాలని ఆర్యవైశ్య సంఘం నిరసన ర్యాలీ

సంధ్యారాణిని హత్య చేసిన ఆమె భర్త రాంబాబును కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గుంట్ల గణపతి, నాయకులు గుర్రం శ్రీనివాసరావు, సన్నిధి రామం వెంకటేశ్వరరావు, సిహెచ్.బలరాం బాబు, జి.వెంకన్నబాబు, నేరెళ్ల విజయ్, పలువురు సంఘ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

గ్రామ సమస్యను గ్రామంలోనే సరిచేసుకుని శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత గ్రామపెద్దలు, కుల పెద్దలపై ఉందని ఆర్‌డిఒ దాసిరాజు, భీమవరం డిఎస్‌పి బండారు శ్రీనాథ్ అన్నారు. వాండ్రం గ్రామంలో శుక్రవారం రాత్రి రెండు సామాజిక తరగతుల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఇరువురి కుల పెద్దలతో గ్రామపంచాయతీ కార్యదర్శి జెవిటి.నాయుడు అధ్యక్షతన శాంతి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీనాథ్, ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వీరస్వామి నాయుడు, గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి శాంతియుత వాతావారణం నెలకొనేలా చర్యలు చేపట్టారు. ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఉండి

ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం కావాలని ఉండి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి జివికె మల్లికార్జునరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. వివాదాలకు తావు లేకుండా ఇంటింటా నిర్వహించే ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతంగా జరగాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయిలో ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సూపర్‌వైజర్లతో జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు 86 శాతం ఇంటింటా సర్వే ఫిజికల్‌గా పూర్తయిందని, మిగిలిన సర్వే ఈనెల 21లోపు పూర్తి చేయాలని, అలా చేయని వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఎన్.విజయలక్ష్మి, ఎస్.వీరాస్వామి నాయుడు, ఎ.కృష్ణారావు, ఎస్‌కె.హుస్సేన్, ఎంపిడిఒలు జి.స్వాతి, కె.వాణి, ఎవి.అప్పారావు, నూకల మురళీ గంగాధర్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఫ్యాప్టో జిల్లా నేతలు హెచ్చరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లా ఫ్యాప్టో నాయకత్వం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందకపోవడం సిగ్గుచేట న్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్, పనిభారం సమస్యలతో సతమతమవుతు న్నారని తెలిపారు. తక్షణం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బదిలీలు జరిగి మూడు నెలలు కాకుండానే పని సర్దుబాటు చేయడం దారుణమన్నారు. సకాలంలో జీతాలు రాక పని ఒత్తిడితో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురువుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు పిఎస్.విజయ రామరాజు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రామచంద్రరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ సిహెచ్.పట్టాభిరామయ్య, మార్కండేయులు పాల్గొన్నారు.

బిజెపి కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

పెనుమంట్ర :బిజెపి కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, 2024 ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మార్టేరు రోటరీ క్లబ్‌లో జరిగిన పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు ఆచంట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో బలరాం మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ వ్యవసాయ ఖర్చులు పెంచి రైతుల ఆత్మహత్యలకు కారకుడయ్యారన్నారు. దేశంలో దళితులపై, ముస్లిం మైనార్టీలపై దాడులు జరుగుతున్నా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపిని కనీసం విమర్శించడం లేదన్నారు. ఈ సమావేశానికి సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, ప్రసాద్, మండల కార్యదర్శి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఇదేనా.. సంక్షేమం రక్షణ

సంక్షేమమే తమ ప్రభుత్వ ఊపిరి అని అర్హులందరికీ పథకాలను అందించడమే తమ లక్ష్యమంటూ ఊదరగొడుతున్న వైసిపి ప్రభుత్వం, బటన్ నొక్కినా ఖాతాల్లోకి సొమ్మురాకపోవడంతో లబ్ధిదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న రాష్ట్రప్రభుత్వం వాటి అమలులో అనేక జిమ్మిక్కులు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. నిబంధనల సాకుతో లబ్ధిదారుల కుదింపు, అర్హులకు సైతం రకరకాల కారణాలతో పథకాలను దూరం చేయడం వంటివన్నీ పాత అంశాలు. తాజాగా అమ్మఒడి దగ్గర నుంచి సున్నా వడ్డీ వరకూ అన్నింటా సిఎం జగన్ బటన్ నొక్కినా లబ్ధిదారులకు సొమ్ము జమకాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

రెండు జిల్లాల్లో అమ్మఒడి సొమ్ము ఇప్పటికీ జమ కానివారు సుమారు 15 శాతం వరకూ ఉండగా అరకొర సొమ్ము జమ అయినవారు 50 శాతం మంది ఉన్నారు. ఈ పథకాల అమలులో జగన్ బటన్ నొక్కిన రెండు మూడు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేది. అయితే ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. ప్రధానంగా అమ్మఒడి లబ్ధిదారులను పరిశీలిస్తే అసలు సొమ్ము జమ కానివారికి సంబంధించి అధికారులు రకరకాల సాకులు చెప్పి సర్దిచెబుతున్నారు. అరకొర సొమ్ము జమయినవారికి మాత్రం త్వరలోనే మిగిలిన సొమ్ము జమవుతుందంటూ చెబుతున్నప్పటికీ లబ్ధిదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటంతో ఏం చెప్పాలో తెలియక అంతా తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్పొరేషన్ ద్వారా సొమ్ము జమచేస్తుండటమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల కష్టాలు పరిగణలోకి తీసుకోకుండా ఆర్భాటపు ప్రచారాన్ని కొనసాగించడంపై అంతా పెదవి విరుస్తున్నారు. డ్వాక్రా మహిళల రుణమాఫీ సొమ్ము జమ విషయంలోనూ సుమారు రెండు, మూడు నెలలు తంతు నడిపారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సున్నా వడ్డీ సొమ్ము జమ ఎప్పటికీ పూర్తవుతుందోనని అంతా చర్చిస్తున్నారు. సంక్షేమంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణమూ లబ్ధిదారులకు సవాలక్ష కష్టాలను తెచ్చిపెట్టింది. ప్రధానంగా ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పునాదిస్థాయి వరకే సరిపోతుండటం, నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడం, ఇసుక సమస్య వెంటాడుతుండడం తదితర అంశాలు లబ్ధిదారులకు తలనొప్పిగా పరిణమించాయి. అదే సమయంలో వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం పూర్తవ్వగానే ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు సకాలంలో సొమ్ము జమ చేయకపోవడం లబ్ధిదారులను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తుంది. ఫలితంగా జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తిస్థాయిలో పడకేసిందని చెప్పొచ్చు. వైసిపి చెబుతున్న సంక్షేమం, అందరికీ ఇల్లు పథకం అంతంతమాత్రంగా అమలు కావడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందనడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా అధికార పార్టీ పెద్దలు ప్రచార ఆర్భాటం మాని పథకాలను పూర్తిస్థాయిలో సకాలంలో అమలు చేయడం ఇళ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటే ఈ ప్రభుత్వం ఊపిరి నిలబడుతుందని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో పరిస్థితులు తారుమారయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

మహిళల రక్షణ, మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని చెబుతున్న పాలకులు వారి కోసం తీసుకొచ్చిన చట్టాల అమల్లో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఫలితంగా చోటు చేసుకుంటున్న దారుణాలు ఉమ్మడి జిల్లాలోనూ సాక్షాత్కరిస్తున్నాయి. దీనికి ఇటీవల కాలంలో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు, అలాగే ఏలూరు జిల్లా మండవల్లి, ముసునూరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న దారుణాలే నిదర్శనంగా చెప్పొచ్చు. మహిళల రక్షణ కోసం దిశా చట్టం, యాప్ తీసుకొచ్చామని అర్భాటం చేస్తున్న ప్రభుత్వం అధికార యంత్రాంగం వరుస సంఘటనలపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆకివీడు పట్టణంలో శనివారం ఉదయం పట్టపగలు గుడికి వెళ్లిన మహిళను భర్త అత్యంత కిరాతకంగా పొడిచి చంపడమే కాక ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి 'మీ కూతుర్ని చంపేశాను వెళ్లి చూసుకోండి' అని చెప్పడం జడలు విప్పిన రాక్షసత్వానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మండవల్లిలో హాస్టల్‌లో విద్యార్థినిపై వరుసకు సోదరుడు, మరో ఇద్దరు ఆకృత్యానికి పాల్పడి ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడం చట్టాలంటే మృగాళ్లకు ఏ పాటి భయముందో తేటతెల్లం చేస్తుంది. ప్రభుత్వాలు, అధికారులు ఉన్నచట్టాలైనా కఠినంగా అమలు చేయడంతో పాటు హింసను ప్రేరేపించే మాధ్యమాలు సంస్కృతిని అరికట్టడమే లక్ష్యంగా ముందుకుసాగితే ఎంతోకొంత మహిళలకు రక్షణ లభించే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నిర్భయ, దిశ చట్టాల పేరు చెప్పుకుని గొప్పలు చెప్పుకోవడంమాని దారుణ ఘటనలు జరిగినప్పుడు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మహిళల రక్షణకు అవసరమైన మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇటీవల జిల్లా కేంద్రం ఏలూరులో చోటు చేసుకున్న ఘటన చెప్పకనే చెబుతోంది. ఇంటి యజమాని ఊరెళ్లగా ఇంట్లో ఉన్న భార్య, కుమార్తె అర్ధరాత్రి ఎవరో తలుపు తడుతున్నారంటూ భయాందోళనకు గురి కావడం స్థానికులు, పోలీసులు వెళ్లినా తలుపులు తీయకపోవడం సమాజంలో ఉన్న రక్షణపై మహిళలకు ఏపాటి నమ్మకం ఉందో తెలియజేస్తోంది. ఈ వరుస సంఘటనలను దృష్టిలో పెట్టుకుని పాలకులు, అధికారులు అటు విద్యాసంస్థల్లో ఇటు ఇతర వేదికల్లో మహిళలకు చట్టాలు, రక్షణపై అవగాహన కల్పించడంతో పాటు ఆ చట్టాల అమలుకు కఠిన చర్యలు చేపట్టాలని పరిశీలకులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో సచివాలయాల్లో మహిళ సంరక్షణ కార్యదర్శుల నియామకం లక్ష్యం నెరవేరదని గంటాపథంగా చెబుతున్నారు.

- విఎస్ఎస్వి.ప్రసాద్

ఎస్‌కెఎస్‌డి కళాశాల విద్యార్థినులకు అభినందన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 18వ తేదీన నిడదవోలు రోటరీ క్లబ్‌లో ఎంపికలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు సెప్టెంబరు 9, 10 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో కె.కార్తీక ఉత్తీర్ణులు(ఫస్ట్), బి.లక్ష్మి (ఫస్ట్) జి.అన్నపూర్ణ (సెకండ్), ఎం.సింధు (సెకండ్), ఎం.విద్యశ్రీ (థర్డ్), టి.లావణ్య (సెకండ్), వి.జ్యోతి (థర్డ్), బి.భవానిప్రసన్న (ఫోర్త్) ఎంపికైనట్లు తెలిపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బిహెచ్.హిమబిందు, యోగా అధ్యాపకులు జి.అబ్బులుచౌదరి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.లక్ష్మయమ్మ అభినందించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రామా స్టూడియోలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ డే కార్యక్రమం పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాలకొల్లుకు ఫొటోగ్రఫీలో మెలకువలు నేర్పి వందలాది మంది శిష్యులను తయారుచేసిన వ్యక్తి కావలి తాతయ్య అని రామా స్టూడియో అధినేత కావలి నగేష్ అన్నారు. ఆయన స్థాపించిన రామా స్టూడియోలో ఆనాటి కెమెరాలతో పాటు నేటి ఆధునిక ఫొటోగ్రఫీ, లైటింగ్ నిర్వహణ ఏ విధంగా ఉండాలన్నదానిపై నగేష్ వివరించారు. అనంతరం నగేష్‌ను రోటరీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు రోటరీ క్లబ్ కార్యదర్శి అబ్బర్తి సతీష్, కోశాధికారి ముత్యాల శ్రీశత్య, అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మాజీ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్, చందక రాము, పీర్ సాహెబ్, మద్దాల వాసు, రోటరీ సభ్యులు జక్కంపూడి కుమార్, కామని ప్రభాకర్, ఎన్ఎస్.మూర్తి, కొనికెట్టి గుప్త పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పత్రికలు, ఛాయ చిత్రాలు లేనిదే గడిచిన నడుస్తున్న చరిత్రకు ఆధారాలు ఉండవని, ఛాయ చిత్రాలు లేని ఇల్లు జగత్తులో ఉండదని జిల్లా విద్యా శాఖాధికారి ఆర్‌వి.రమణ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక, భీమవరం ఏరియా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం మెంటేపువద్ద వివేకానంద ప్యాడిస్ మర్చంట్ అసోసియేషన్ హాలులో శనివారం నిర్వహించిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం, దాగ్యూరే జయంతి వేడుకలకు డిఇఒ ఆర్‌వి.రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా.మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల నుంచి సాధారణ వేడుకలకు కూడా ఫొటోగ్రఫీ అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 1839లో దాగ్యూరే కెమెరాను కనిపెట్టారన్నారు. ఆనాటి నుంచి లక్షలాది మంది జీవనోపాధి పొందుతున్నారని, ఆయుష్షులేని ఫొటోగ్రాఫర్ల జీవితాలు, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడకపోవడం బాధాకరమన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు టి.చిట్టిబాబు అధ్యక్షత వహించారు. అసోసియేషన్ చైర్మన్ శ్యాం నాగేశ్వరావు, సభ్యులు ఆదిత్యబాబీ, సెక్రటరీ ఎం.సింహాద్రి, గౌరవాధ్యక్షులు గంట గణేష్ కుమార్, గౌరవ సభ్యులు రామాయణం సుధ, చెక్క రామకృష్ణ, వీర బాబీ, గంట వెంకటేశ్వరావు మాట్లాడారు. అనంతరం నూతనంగా ఎన్నికైన శ్యాం నాగేశ్వరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ప్యాడి రైస్ మర్చంట్స్ సభ్యులు పాల్గొన్నారు.

వల్లూరులో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు

ఎంపిపి సూర్యకుమారి

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో ఎంపిపి నిధులు రూ.25 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపిపి సూర్యకుమారి తెలిపారు. మండలంలోని వల్లూరు గ్రామంలో రహదారులను, డ్రెయిన్లను ఎంపిపి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి సూర్యకుమారి మాట్లాడుతూ మామిడిచెట్టువారిపాలెంలో రూ.మూడు లక్షలతో గ్రావెల్ రహదారిని చేపట్టామన్నారు. ఉత్తరపాలెం హరిజనపేట, కొమ్ముల వీధిలో రూ.మూడు లక్షలతో సీసీ రోడ్డు, గెద్దాడవారిపాలెం, కనకదుర్గ ఆలయం వద్ద రూ.రెండు లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మించామని తెలిపారు. గెద్దాడవారిపాలెం పంట కాలువ వంతెనకు రూ.ఆరు లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టామన్నారు. నేదునూరివారిపాలెంలో రూ.8 లక్షలతో గ్రావెల్ రోడ్డు, భరత్ నగర్ ఎస్‌సి కాలనీలో లక్ష రూపాయాలతో సీసీ రోడ్డు, వల్లూరు తోటలో రూ.మూడు లక్షలతో గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే వల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచి నేలపూడి బేబీరామ్మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దేవళ్ల రమేష్, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపిపి గెద్దాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవత్వ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక బివి.రాజు డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 162 ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మానవత్వ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ నన్నయ విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్య ఎం.కమలకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన విద్యను అభ్యసించాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవాలన్నారు. వీటన్నింటిని సంపాదించడానికి మానవత్వ విలువలు చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డిఐఆర్.కృష్ణంరాజు, సిహెచ్ఎస్‌వి.సత్యనారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపన జరగాలి : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజంలో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందినప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని శనివారం రెండో పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిర్వహించారు. తొలుత విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల చరిత్రలను ప్రపంచానికి చాటి చెప్పడానికి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ఏడాది పాటు నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమన్నారు.

నేరాలు - ఘోరాలు

వంతెన రెయిలింగ్‌ను ఢీ కొట్టిన స్కూల్ బస్సు

తప్పిన పెను ప్రమాదం

కాళ్ల : సీసలి గ్రామంలో ఘోర ప్రమాదం తప్పింది. కాళ్ల నుంచి సీసలి వెళ్తున్న ఒక ప్రయివేట్ స్కూల్ బస్సు ప్రమాదవశాత్తు అదుపుతప్పి వంతెన రెయిలింగ్‌ను ఢీకొట్టింది. బస్సులో సీసలి, కోమటిగుంట గ్రామానికి చెందిన విద్యార్థులు 20 మంది ప్రయాణిస్తున్నారు. స్కూల్ బస్సు డ్రైవర్ మద్యం తాగా బస్సు నడపడమే ప్రధాన కారణం. డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాళ్ల ఎస్ఐ మూర్తి తెలిపారు.

పలువురిపై కేసు

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి అలజడికి కారకులైన వారిపై ఉండి పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీన శ్రావణ లక్ష్మివారం సందర్భంగా మండలంలోని వాంద్రం గ్రామంలో ఒక వర్గం వారు జాతర జరుపుకుంటుండగా హరిజన పేటకు చెందిన కోణాల భాగ్యరాజ్, కోణాల అనిల్, పాము అఖిల్, ఇంటి కిషోర్ మోటార్ సైకిల్ వేసుకుని వెళ్లి జాతరలో గొడవ సృష్టించడంతో పెద్దలు వారిని మందలించి పంపించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పాలపర్తి రామకృష్ణ ఫ్యాక్టరీ నుంచి విధులు ముగించుకుని వస్తుండగా కోణాల భాగ్యరాజ్ అతని స్నేహితులు పాలపర్తి రామకృష్ణను మార్గమధ్యలో అడ్డగించి తీవ్రంగా గాయపరిచారు. విజ్జిరోతి శ్రీనివాస్, దినేష్, అప్పల కిట్టయ్య, చింతల సతీష్, గుణ జగదీష్, కొర్రకూటి రాజేష్, సందక సాంబ విషయం తెలుసుకుని గ్రామ పెద్దలను తీసుకుని హరిజన పేటకు వెళ్లి గొడవ చేశారు. అక్కడ జరిగిన అల్లర్లలో తీవ్ర గాయాలైన కోణాల భాగ్యరాజ్, కోనాల అనిల్, పాము అఖిల్, ఇంటి కిషోర్‌లు పాలపర్తి రామకృష్ణ, అతని ఆరుగురి స్నేహితులు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గొల్లలకోడేరు విజయం.. అరాచక పాలనకు చరమగీతం

వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు


మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు పంచాయతీ ఆరో వార్డు ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిందని, ప్రజలు ఇచ్చిన విజయం పంచాయతీ అరాచక పాలనకు చరమగీతం అని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. పార్టీలకు అతీతంగా వైసిపి గ్రామ అధ్యక్షులు చేకూరి రాజా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆరో వార్డు అభ్యర్థి సంబలదీవీ నాగమణి విజయం సాధించడం పట్ల పివిఎల్ హర్షం వ్యక్తం చేసి గొల్లలకోడేరులో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అభ్యర్థిని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. అభ్యర్థి నాగమణి విజయానికి కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. కొంతమంది గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారని చెప్పారు. పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులంతా కలిసి అటువంటి వ్యక్తులకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. వైసిపి గ్రామ అధ్యక్షులు రాజా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పంచాయతీలో జరుగుతున్న అవినీతికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా విజయం సాధించామన్నారు. కేవలం కొంతమంది వ్యక్తులు వల్ల గ్రామ అభివృద్ధి వెనుక పడిందని, ఈ విజయంతో వారు మార్పు చెందాలని, లేకపోతే రానున్నరోజుల్లో వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అభ్యర్థి నాగమణి గెలుపునకు పార్టీలకతీతంగా సహకరించిన ప్రతిఒక్కరికి రుణపడి ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతి రాజు వంశీకృష్ణమరాజు, ఎంపిటిసి సభ్యులు కరోతి వెంకటలక్ష్మి, నాయకులు పెనుమత్స శ్రీనివాసరాజు, జివి.నరసింహారావు, సంబలదీవి వెంకటేశ్వరరావు, కుక్కల బాబురావు, వీరవల్లి శ్రీను గోపాల్‌రావు, శ్రీనివాస్, సాల్మన్‌రాజు, కరోతి సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపికి అభినందనలు

ఆరో వార్డు అభ్యర్థి నాగమణి గెలుపునకు కృషి చేసిన టిడిపి గ్రామ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు, మాజీ సర్పంచి గాదిరాజు సూర్యనారాయణరాజును, టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్‌కోటేశ్వరరాజు అభినందించారు. గొల్లల కోడేరులో పంచాయతీ వద్ద పుష్పగుచ్ఛం అందించి ఇరువురికి శుభాకాంక్షలు తెలిపారు.

రాంబాబును సత్కరిస్తున్న కోటిరాజు

ఆయనతో పాటు టిడిపి నాయకులు నేతల గోపి, కాజా వీరాస్వామి ఉన్నారు.

హోరాహోరీ పోరు

గొల్లలకోడేరు పంచాయతీ ఆరో వార్డు ఎన్నిక హోరాహోరీగా జరిగింది. బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలవగా శనివారం ఈ ఎన్నికకు పోలింగ్ జరిగింది. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్ జరిగింది. అయితే సంబలదీవి నాగమణికి 168 ఓట్లు, మరో అభ్యర్థి పడమటి రామలక్ష్మికి 126 ఓట్లు, మరో అభ్యర్థి సువ్వాడ మోహినికి మూడు ఓట్లు లభించాయి. నోటాకు ఒకటి, చెల్లని ఓట్లు మూడు పడ్డాయి. దీంతో ప్రత్యర్థులపై సంబల దీవి నాగమణి 42 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. మొత్తం ఆరో వార్డులో 346 ఓటర్లు ఉండగా 300 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల అధికారి శివకృష్ణ నాగమణి గెలుపును ప్రకటించి నియామక పత్రాన్ని అందించారు. భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్, ఎస్ఐ నాలం శ్రీనివాసరావు ఎన్నికలను పర్యవేక్షించారు.

యాజమాన్య పద్ధతులే మేలు

మార్టేరు పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త భువనేశ్వరి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సార్వాలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు సమస్యాత్మకమైందని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ వరి తెగుళ్ల విభాగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.భువనేశ్వరి అన్నారు. ఈ కాలంలో సాగుచేసే కొన్ని రకాల్లో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తున్నట్టుగా తెలిపారు. గత సంవత్సరంలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు క్రెసెక్ దశ, ఎండాకు తెగులు దశల రెండింటినీ కొన్ని రకాల్లో గుర్తించామన్నారు. చాలా మంది రైతు సోదరులు క్రెసెక్ దశ లక్షణాలను కాండం కుళ్లు తెగులుగా పొరబడి అనవసరంగా శిలీంద్రనాశినిలు పిచికారీ చేయడం వల్ల తెగులు నివారణ సరిగా జరగకపోగా సాగు ఖర్చు కూడా పెరిగిపోతుం దన్నారు. రైతు సోదరులు ఈ తెగులు లక్షణాలను గుర్తించి తగిన సమయంలో యాజమాన్య చర్యలు చేపట్టడం వల్ల ఈ బాక్టీరియా ఆకు ఎండు తెగులును సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. క్రెసెక్ దశ నారు మడి దశ నుంచి నాట్లు వేసిన నెల రోజుల వరకు వరి పంటను ఆశిస్తుందని తెలిపారు. కొన్ని సార్లు నాటిన 30 రోజుల తరువాత కూడా ఈ తెగులు ఆశించవచ్చని తెలిపారు. నారుమడిలో ఆకులు అంచుల నుంచి లోపలి వైపునకు నీటి డాగు మచ్చల మాదిరిగా ఏర్పడి క్రమేపి పసుపు రంగుకు మారతాయన్నారు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దుబ్బులో కొన్ని పిలకలు గానీ, దుబ్బు మొత్తం చనిపోతుందని తెలిపారు. దీనిని క్రెసెక్ దశ అని పిలుస్తామన్నారు. చాలా మంది రైతులు ఈ లక్షణాలను కాండం కుళ్లు లేక దుబ్బు కుళ్లు తెగులు అని పొరపడి శిలీంద్రనాశినులు పిచికారీ చేస్తున్నారన్నారు. తెగులు నిర్ధారణ కోసం ఎండిన ఆకులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాల న్నారు. ఇలా చేయడం వల్ల తెగులు సోకిన భాగాల నుండి బాక్టీరియా నీటిలోకి ప్రవించడం వల్ల కొద్ది గంటల తరువాత నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారడం జరుగుతుందన్నారు. ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లుగా గుర్తించాల న్నారు. అదే కాండం కుళ్లు ఆశించిన పిలకలను గమనిస్తే మొదటి కణుపు వద్ద కుళ్లి, మొక్క చనిపోతుందన్నారు. అటువంటి పిలకలను చీల్చి చూస్తే మొదటి కణుపు వద్ద నల్లగా మారుతుందని తెలిపారు. బాక్టీరియా ఆకుఎండు తెగులు ఆశించిన మొక్కలో ఇటువంటి కుళ్లు లక్షణాలు కనిపించకుండానే పిలకలు ఎండి పోతాయన్నారు. తెగులు సోకని ఆరోగ్యవంతమైన పొలం నుండి మంచి విత్తనం సేకరించి, నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మేరకే 2, 3 దఫాలుగా వాడాలన్నారు. స్వర్ణ, ఎంటియు రైస్ 1318 వంటి రకాల్లో ఎక్కువ నత్రజని వేయకూడదన్నారు. వర్షాలు పడే వాతావరణంలో ఆకులపై తెగులు లక్షణాలు ఐదు శాతం కంటే ఎక్కువగా వ్యాపించి ఉంటే, పై పాటుగా వేయాల్సిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివే యాలని చెప్పారు. సిఫారసు చేసిన పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలోనూ, అంకురం దశలోనూ వేసుకోవాలని చెప్పారు. పొలం గట్లపై బాక్టీరియాకు ఆవాసం కల్పించే కలుపు, ఇతర పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలని, తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని 2 లేదా 3 సార్లు మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీసివేసి కొత్త నీరు పెట్టడం వల్ల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఉధృతి కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపారు.

లయన్స్ క్వెస్ట్ బోధించాలి

ప్రజాశక్తి - తణుకు

లయన్స్ క్వెస్ట్ పాఠాలను ప్రభుత్వ పాఠశాలలో బోధించే విధంగా పరిశీలించాలని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ కలెక్టర్ పి.ప్రశాంతిని విన్నవించారు. ఈ మేరకు ఆయన శనివారం కలెక్టర్‌ను కలిసి చర్చించారు. లయన్స్ క్లబ్ తయారుచేసిన పాఠ్యాంశాన్ని కలెక్టర్ పరిశీలించారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు ఈ పాఠ్యాంశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఒత్తిడిని తట్టుకునే మనస్తత్వం కలుగుతుందని కలెక్టర్ ప్రశాంతి చెప్పారని తెలిపారు. త్వరలో జిల్లాలో మూడు సెంటర్లలో టీచర్ ట్రైనింగ్ ఏర్పాటు చేస్తామన్నారని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, మాజీ గవర్నర్లు సిహెచ్.కృష్ణంరాజు, డాక్టర్ బాబ్జి, డిఇఒ వెంకటరమణ తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన

నరసాపురం టౌన్ : మండల న్యాయ సేవాధికార కమిటీ సూచనల మేరకు నరసాపురం మండలంలో లక్ష్మేశ్వరం సారవ పలు గ్రామాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్ కావూరు మురళి, నాగిడి రాంబాబు మాట్లాడుతూ సెప్టెంబర్ తొమ్మిదో తేదీన నరసాపురంలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రకాల సివిల్, క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ మేళం చిరంజీవి, సతీష్, పంచాయతీ కార్యదర్శి యర్రంశెట్టి వెంకట రామ సత్యనారాయణ పాల్గొన్నారు.

రావూరి అభిషేక్‌కు యడ్ల తాతాజీ అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

రావూరి అభిషేక్‌ను అభినందిస్తున్న తాతాజీ

పాలకొల్లు ప్రముఖ న్యాయవాది రావూరి చాచా కుమారుడు రావూరి అభిషేక్ గ్రూప్-1 ఫలితాల్లో రాణించి డిఎస్‌పిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రావూరి అభిషేక్‌కు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అభినందనలు తెలిపారు. శనివారం ఆయన స్వగృహం వద్ద స్వయంగా కలిసి భవిష్యత్తులో సివిల్స్ సాధించి పాలకొల్లుకు మంచి పేరు తీసుకురావాలని ఆశించారు. ఆయనతో పాటు కొంతేరు శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు పెచ్చెట్టి కృష్ణాజి, మాజీ కౌన్సిలర్ రేలంగి శ్రీను, మాజీ సర్పంచి గంటా నరేష్, అల్లం బుజ్జి, కర్పూరం వెంకటేశ్వరరావు, అడ్డాల వాసు పాల్గొన్నారు.

పడాల శ్యామసుందరరావు సేవలు మరువలేనివి

పుస్తకావిష్కరణ సభలో మాజీ మంత్రి సుబ్బారాయుడు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

అలుపెరుగని యోధుడు పడాల శ్యామసుందరరావు అని మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు కొనియాడారు. వైఎన్.కళాశాల పీజీ సెమినార్ హాలులో శనివారం నరసాపురం తొలి ఎంఎల్ఎ, కమ్యూనిస్టు పార్టీ నేత పడాల శ్యామసుందర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సభలో కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ ఎంఎల్ఎగా పడాల కృషి మరువలేనిదన్నారు. ఈ సభకు సిపిఐ జిల్లా నాయకులు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. శ్యామసుందరరావు పెద్ద కుమార్తె డాక్టర్ సమతా రోష్మి, చరిత్ర పరిశోధకుడు గుర్రం సీతారాములు, యర్రంశెట్టి దుర్గా శ్రీనివాస్ రచించిన ఈ పుస్తకాన్ని దారిదీపం ఎడిటర్ డివివి ఎస్.వర్మ ఆవిష్కరించారు. తొలుత ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ పుస్తక సమీక్ష నిర్వహించారు. శ్యామసుందరరావు చిన్న కుమార్తె మమతా నళిని వందన సమర్పణ నిర్వహించారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు, వైఎన్.కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యనారాయణరావు, అడ్వకేట్ కామన బాల సత్యనారాయణ (బుజ్జి), రిటైర్డ్ ప్రొఫెసర్ మనోరమ, రచయిత్రి కరుణ తాయమ్మ, మహిళా నాయకులు పావని, జగదాంబ, సిపిఐ నేత నెక్కంటి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసినవారిని శిక్షించాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాజ్

ప్రజాశక్తి - ఉండి

దళితులపై దాడి చేసి చర్చి అద్దాలు పగలగొట్టిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని వాంద్రం గ్రామంలో దళితులను పుష్పరాజు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి కొంతమంది అగ్రవర్ణాల వారు దళితులపై దాడి చేసి మారణాయుధాలతో బెదిరించిన వారిని తక్షణమే అరెస్టు చేసి వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లోకి వెళ్తున్న ఎస్‌సి, ఎస్‌టి నాయకులను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. గ్రామస్తులతో కలిసి వారిపై పెట్టిన కేసులు తక్షణమే ఎత్తివేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణరాజు, జిల్లా కార్యదర్శి చిల్లి రాజ్‌కుమార్, ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, ఉండి మండల అధ్యక్షులు తోర్లపాటి భాగ్యరాజ్, నియోజవర్గ కార్యదర్శి నవమణి రాజు, రాజశేఖర్, సాయి జగన్నాథ్, భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి నేతల సాల్మన్ రాజు, జెఎసి సభ్యులు పాల్గొన్నారు.

పొన్నమండ బాలకష్ణను అడ్డుకున్న పోలీసులు

పొన్నమండ బాలకృష్ణను అడ్డుకుంటున్న పోలీసులు

మండలంలోని వాంద్రం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన దాడుల్లో గాయపడిన దళితుల కుటుంబాలను పరామర్శించేందుకు శనివారం వాంద్రం వెళ్తున్న ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మానిటరింగ్ సభ్యులు పొన్నమండ బాలకృష్ణను పోలీసులు అడ్డుకున్నారు. వేరే గ్రామస్తులు వాంద్రం గ్రామంలోకి వెళ్లేందుకు ఎవరికి అనుమతులు లేవని పోలీసులు చెప్పడంతో పొన్నమండ బాలకృష్ణ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి ఎస్‌టి కమిషన్ మానిటరింగ్ సభ్యునిగా రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా వెళ్లే అర్హత తనకుందని, ఎవరి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం తనకు లేదని చెప్పారు. తనని అడ్డుకున్న పోలీసులపై ఉన్నతాధికారులకు ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు.

వాంద్రం ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి

భీమవరం : ఉండి మండలంలోని వాంద్రం గ్రామం పెద్ద పేటపై అగ్రవర్ణాలకు చెందినవారు దాడి చేయటం దారుణమని, నిందితులను శిక్షించాలని ఎస్‌సి ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ డిమాండ్ చేశారు. వాంద్రం గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన బాధిత దళితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ దళితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు. అనంతరం భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్‌లకు స్థానికంగా నెలకొన్న సమస్యలను విన్నవించారు. దాడికి పాల్పడిన నిందితులపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ, పిఒఎస్ యాక్ట్ 302 కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు.

సబ్‌జైలులో జైలు అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక సబ్ జైలును నరసాపురం ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలు అదాలత్ నిర్వహించారు. నిందితులతో మాట్లాడి వారి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేనివారికి సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిందితులకు అందుతున్న భోజన వసతుల గురించి జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తితో పాటు ఉచిత న్యాయవాది కె.శిరీష, పారా లీగల్ వాలంటీర్ డి.వరలక్ష్మి, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు పాల్గొన్నారు.

పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రమైన మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిరంజీవి అభిమానులు ప్రజలకు శనివారం పండ్లు, రొట్టెలను అందించారు. ఈ నెల 22వ తేదీన చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో పలు సేవా కార్యక్రమాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చిరు యువత మొగల్తూరు మండల కమిటీవారు తెలిపారు. చిరు యువత మండల అధ్యక్షులు దాసరి కృష్ణాజి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కోపల్లి శ్రీనివాస్, లక్కు బాబి, గుగ్గిలపు శివరామకృష్ణ, గన్నాబత్తుల రామ్‌కుమార్, ముక్కుగిరి, చెన్నంశెట్టి నాగు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య తెలిపారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వద్ద ఇటీవల నూతనంగా నిర్మించిన స్థానిక లయన్స్ క్లబ్ హాలులో మంతెన వెంకట సూర్యనారాయణ రాజు సుభద్రమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, ఏలూరుపాడు, ఆకివీడు లయన్స్ క్లబ్బులతో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులను చైతన్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వంద మంది పేద వృద్ధులకు దుప్పట్లు, భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రపంచ శాంతి కోసం మానవత స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. మానవత పట్టణ శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శాంతిర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చదువుతోపాటు సామాజిక బాధ్యతను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గాంధీ బొమ్మల సెంటర్ నుంచి యడ్ల బజార్ కూడలి వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అంటూ విద్యార్థులు నినదించారు.

టిడిపి హర్షం

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజవర్గంలోని ఇరగవరం మండలం కావలిపురం గ్రామ పంచాయతీకి జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి బలపర్చిన అభ్యర్థి విజయం సాధించడం పట్ల తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం గ్రామంలో జరిగిన విజయోత్సవ ఊరేగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి వనచర్ల అప్పన్న స్వామి 164 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అభినందించారు. స్వామి విజయానికి కృషి చేసిన కావలిపురం టిడిపి నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో పాల్గొన్నారు. తేతలి ఎనిమిదో వార్డుకు జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపర్చిన కోట దుర్గారావు గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విజయలక్ష్మికి ఎంఎల్ఎ గ్రంధి అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వీరవాసరం మండలంలోని మత్స్యపురి గ్రామపంచాయతీకి సంబంధించి ఒకటో వార్డులో శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థి కారేంపల్లి విజయలక్ష్మి జనసేన బలపర్చిన అభ్యర్థి కారేంపల్లి కమల కుమారిపై 167 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో కారేంపల్లి విజయలక్ష్మి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకటో వార్డులో పూర్తిగా దళిత ఓటర్లే ఉన్నారని, ఈ నేపథ్యంలో పోటీ వద్దని, ఏకగ్రీవం చేసుకుందామని జనసేన, టిడిపి నాయకులను కోరినట్లు చెప్పారు. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి విజయలక్ష్మిని గెలిపించాయని తెలిపారు. తొలుత విజయలక్ష్మిని ఎంఎల్ఎ గ్రంధి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అండలూరు సొసైటీ అధ్యక్షులు, వీరవాసరం మండలం జెసిఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, పార్టీ మండల కన్వీనర్ గూడూరి ఓంకార్, నేతల జ్ఞాన సుందరరాజు, చొప్పల బాబ్జి, గోడి సువర్ణ రాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి
రాజమహేంద్రవరం
Crl. M.P.No. 500/2022
Crl. R.P.No. 3484/2022
బిట్వీన్:
ముళ్ళపూడి చంద్రమౌళి ప్రసాద్, తండ్రి: వీరన్న చౌదరి, హిందు, వయస్సు 43 సం॥లు, రఘుదేవపురం, సీతానగరం మండలం, తూ॥గో॥జిల్లా. ...పిటీషనరు
మరియు
మేరుగు నాగార్జున, తండ్రి: లక్ష్మయ్య, హిందు, వయస్సు 48 సం॥లు, డో.నెం. 10-101, శత్రువాహన నగర్, 4వ రోడ్డు, 4-ఎ1, ఏలూరు, ప॥గో॥జిల్లా.
...రెస్పాండెంటు
పై నెంబరు క్రిమినల్ రివిజన్ పిటీషను దాఖలు చేయుటలో జరిగిన ఆలస్యము 77 రోజులను రద్దుపరచవలసినదిగా కోరుచూ పై పిటీషను పిటీషనరు దాఖలు చేసియున్నారు. పై పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టులు ద్వారాను ఎన్నిసార్లు సమన్లు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచుండుట వలన మహారాజశ్రీ కోర్టు వారు మీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా నోటీసు పంపమని ఆర్డరు వేసినారు. మీరు **ది.31-08-2023వ తేదీన పై చెప్పబడిన శ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రాజమహేంద్రవరం కోర్టుకు ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు అయి మీ అభ్యంతరములు తెలియపరచవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షములో విచారణ జరుపగలరు.
APPALA SUBRAMANYAM
Advocate, Seetampeta,
Rajahmundry. Cell: 93930 36723

ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC)పోయినది
POTHURAJU KUMARI అను నాకు KUWAIT రాయబార కార్యాలయం అధికారులు ది.11-06-2013న X0988857 నెంబరుగల ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. ది. 10-8-2023 పెద అమిరం గ్రామం నుండి నరసాపురం పట్టణం చినమామిడిపల్లిలోని మా అమ్మగారి ఇంటికి వెళ్ళిన సందర్భంలో సదరు EC జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు మెయిన్ రోడ్‌కు వెళ్ళినపుడు నా ఒరిజినల్ EC పోయినది. గాన నా ఎమర్జన్సీ సర్టిఫికెట్ EC ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అదించగలరని కోరుతున్నాను
POTHURAJU KUMARI
W/o. Pothuraju Anil Kumar
D.No. 6-173, Colony Pedamiram
Kalla Mandal
West Godavari Dist, A.P.